బుధవారం
04-09-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1, సంచిక: 445 పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



ఇంకా వరదనీటిలో బెజవాడ

మిగతా 2లో




తెలంగాణకు భారీ వర్ష సూచన

మిగతా 2లో



బ్రూన్ సుల్తాన్‌కు 7000 లగ్జరీ కార్లు

మిగతా 3లో



వినాయకుడిని వీటితో కూడా అందంగా చెయొచ్చు..

మిగతా 4లో



## దాదాపు 30 వేల ఎకరాల్లో
# పంటనష్టం

### ఒక్క జిల్లాలో నలుగురు మృతి చెందడం బాధాకరం

### మృతుల కుటుంబాలకు ఐదు లక్షల నష్టపరిహారం

### వరదలపై సమీక్ష సమావేశంలో రేవంత్‌రెడ్డి

ముందడుగు తెలంగాణ:
తెలంగాణలో భారీ వర్షా లు కురుస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం మహబూబాబాద్ జిల్లాలో నమోదైందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. మహబూబాబాద్ జిల్లాలో పర్యటించిన సిఎం, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నలుగురు మిగతా 2లో

## వరద సహాయక చర్యల్లో
# ప్రభుత్వ వైఫల్యం

### వరద బాధితులకు ఆహారం కూడా అందించలే

### రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి

### మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణ



ముందడుగు ఖమ్మం:
తెలంగాణలో గత కొన్ని రోజులుగా భారీ వర్షా లు కురుస్తున్నాయి. భారీ వర్షా లు, వరదల కారణంగా 30మంది చనిపోతే.. కేవలం 15 మందే చనిపోయారని చెబుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. చనిపోయిన వారి సంఖ్యను కూడా ప్రభుత్వం తక్కువగా చూపుతోందన్నారు. వరద ప్రాంతాలను పరిశీలించిన అనంతరం బిఆర్ఎస్ నేతలతో కలిసి ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సాగర్ ఎడమకాలువకు గండి పడిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఆరోపించారు. "వరద బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. నిత్యావసరాలు సహా దస్త్రాలు, పుస్తకాలు కూడా కొట్టుకుపోయాయి. ఇళ్లపై నిలబడిన వరద బాధితులకు ఆహారం కూడా అందించలేదు. మిగతా 2లో

# ఇంకా వరదనీటిలో బెజవాడ

### తగ్గుముఖం పడుతున్న వరద ప్రభావం

### సహాయక చర్యలతో ఇప్పుడిప్పుడే ఉపశమనం

### బాధితులకు అండగా నిలవాలన్న చంద్రబాబు

### సినీపరిశ్రమకు చెందిన పలువురు విరాళాలు


ముందడుగు ఆంధ్రప్రదేశ్:
ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షా ల వలన తెలుగు రాష్ట్రాలు అతలాకుతలంగా మారాయి. వరద ప్రభావంతో బీభత్సంగా మారాయి. మూడురోజులుగా తీవ్ర ఇబ్బందులు పడిన బాధితులకు సహాయక చర్యలతో ఇప్పుడిప్పుడే ఉపశమనం కలుగుతోంది. విజయవాడలో వరద పరిస్థితి, పునరావాస కార్యక్రమాలను సీఎం చంద్రబాబు క్షేత్రస్థాయిలో మిగతా 2లో



## కాల్పులతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతం

### దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్

### కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు మృతి



ముందడుగు ఛత్తీస్‌గఢ్:
ఛత్తీస్‌గఢ్ దంతెవాడ-బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని దండకారణ్యంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలతో జరిగిన కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు మృతి మిగతా 2లో

ముందడుగు
బుధవారం, 04-09-2024, హైదరాబాద్

# దాదాపు 30 వేల ఎకరాల్లో పంటనష్టం



(మొదటిపేజీ తరువాయి)

మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. దాదాపు 30వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని వెల్లడించారు. సహాయచర్యల్లో నిరంతరం పనిచేసిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అభినందించారు.

"అధికారుల చర్యలతో ప్రాణనష్టం తగ్గించగలిగాం. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించాం. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తాం. నష్టపోయిన మూడు తండాలవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం. నష్టంపై కేంద్రానికి నివేదించడానికి నివేదిక తయారు చేయాలి. కేంద్రం దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి. ఆస్తి, ప్రాణ నష్ట పరిశీలనకు ప్రధాని మోదీని ఆహ్వానించాం. తక్షణమే రాష్ట్రానికి రూ.2వేల కోట్లు కేటాయించాలి. వర్షం తగ్గినందున బురద తొలగించే పనులు అధికారులు ప్రారంభించాలి. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తే ఇళ్లలోని బురద తొలగించవచ్చు. విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది.. మరింత జాగ్రత్తగా ఉండాలి.
ఎంత ఒత్తిడి ఉన్నా హైడ్రా ఏర్పాటు చేసి ఆక్రమణలను కూల్చేస్తున్నాం. ప్రకృతి ప్రకోపిస్తే ఏం జరుగుతుందో మనం ఇతర రాష్ట్రాల్లో చూస్తున్నాం. చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. ఆక్రమణలకు సహకరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయి. పేదల ప్రాణాలు పోయాక ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోదు. పువ్వాడ ఆక్రమణలు తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేయగలరా? ఆక్రమణల తొలగింపునకు హరీశ్‌రావు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తారా? చెరువులను ఆక్రమించిన వారు ఎంతటివారైనా తొలగించాల్సిందే. ఆక్రమణల తొలగింపునకు విధివిధానాలు రూపొందించాలి"అని సీఎం రేవంత్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఇంకా వరదనీటిలో బెజవాడ

(మొదటిపేజీ తరువాయి)

దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ బాధితులకు సహాయం అందిస్తున్నారు. వాహనాలు వెళ్లలేని చోటికి సాంకేతికత సాయంతో ఆహారం పంపిణీ చేస్తున్నారు. దీనికోసం డ్రోన్లు, హెలికాప్టర్ల సాయం తీసుకుంటున్నారు. మరోవైపు వరద బాధితుల సహాయార్థం పలువురు సినీ పరిశ్రమకు చెందిన వారితో పాటు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారు.



## బాధితులకు అందరూ అండగా నిలవాలి: సీఎం చంద్రబాబు

వరద బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలూ చేపట్టామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. కొన్ని చోట్ల ఆహారం అందలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విజయవాడ కలెక్టరేట్ వద్ద మీడియాతో సీఎం మాట్లాడారు. ఈ కష్ట సమయంలో బాధితులకు అందరూ అండగా నిలవాలని కోరారు. ఏవిధంగా సహకారం అందించగలిగితే అలా చేయూత అందించాలన్నారు. ప్రభుత్వం తరఫున చేయాల్సిందంతా చేస్తామని చెప్పారు.

## సినీ ప్రముఖులు విరాళాలు


ఏపీ, తెలంగాణ వరద బాధితులను ఆదుకునేందుకు తెలుగు సినీ నటులు, నిర్మాణ సంస్థలు విరాళాలు ప్రకటించాయి. ఏపీ, తెలంగాణ సీఎంల సహాయ నిధికి బాలకృష్ణ రూ. కోటీ, మహేష్ బాబు రూ.కోటీ, జూనియర్ ఎన్టీఆర్ కోటీ ఇస్తున్నట్లు ప్రకటించారు. సిద్ధూ జొన్నలగడ్డ రూ.30లక్షలు (ఏపీ, తెలంగాణకు రూ.15 లక్షలు చొప్పున), విష్వక్‌సేన్ రూ.10లక్షల విరాళం ప్రకటించారు.

# వరద సహాయక చర్యల్లో ప్రభుత్వ వైఫల్యం

(మొదటిపేజీ తరువాయి)

వరద సహాయక చర్యల్లో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోంది. రాష్ట్రానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కేంద్రం ఎందుకు పంపలేదు. రాష్ట్రాన్ని ఆదుకోవడంలో కేంద్ర ప్రభుత్వం కూడా విఫలమైంది. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి. అందరం కలిసి వెళ్లి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ఖమ్మం, మహబూబాబాద్ ప్రజలు బలైపోయారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25లక్షలు ఇవ్వాలి.
నష్టపోయిన వారికి తక్షణమే రూ.2లక్షల పరిహారం ఇవ్వాలి. వర్షం తగ్గి రెండ్రోజులు అయినా.. విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. మంచినీరు, ఆహారం కూడా సరఫరా చేయలేదు. వరద బాధితులకు 5 కిలోల బియ్యం ఇస్తే ఎలా వండుకుంటారు?"అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# కాల్పులతో దద్దరిల్లిన బస్తర్ ప్రాంతం



(మొదటిపేజీ తరువాయి)

చెందినట్లు పోలీసులు వెల్లడించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాంతంలో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, సీఆర్పీఎఫ్ బలగాలు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతాబలగాలను చూసిన మావోయిస్టులు వారిపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు చేపట్టాయి. ఉదయం 10.30 గంటలకు మొదలైన ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఇప్పటివరకు 9 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్లు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఘటనాస్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.



# తెలంగాణకు భారీ వర్ష సూచన

- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

ముందడుగు తెలంగాణ:
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మంగళవారం, బుధవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షా లు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల్లో భారీ వర్షా లు పడే అవకాశముందని ఐఎండీ సంచాలకులు ప్రకటించారు. బుధవారం కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షా లు కురుస్తాయని, ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.

మధ్య విదర్భ పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం ప్రస్తుతం బలహీనపడి పశ్చిమ విదర్భ పరిసర ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పారు. దీనికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి 3.1కి.మీ ఎత్తు వరకు ఆవరించిన ఉందని వివరించారు. కోస్తాంధ్ర, యానాం పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టం నుంచి 3.1 నుంచి 5.8కి.మీ వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని పేర్కొన్నారు.

ముందడుగు
బుధవారం, 04-09-2024, హైదరాబాద్

# తోడేళ్లు కనిపిస్తే కాల్చివేయండి

- ఉత్తరప్రదేశ్ సిఎం ఆదేశాలు జారీ
- ఇప్పటికి తోడేళ్ల దాడుల్లో 10 మంది మృతి




ముందడుగు ఉత్తరప్రదేశ్:
గత కొన్ని నెలలుగా ఉత్తరప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లాను మహసి ప్రాంతంలోని ఈ జీవాల వరుస దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో వీటిని పట్టుకోవడం కోసం అధికారులు 'ఆపరేషన్ భేడియా' చేపట్టినా.. దాడులు మాత్రం ఆగట్లేదు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. తోడేళ్లు కన్పిస్తే కాల్చేయాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఇప్పటివరకు తోడేళ్ల దాడుల్లో 10 మంది మరణించగా.. దాదాపు 30 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో తొమ్మిది మంది చిన్నారులే కావడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. అటవీశాఖ అధికారులకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. తోడేళ్లను పట్టుకోవడం అసాధ్యమైన తరుణంలో వాటిని కాల్చేయాలని ఆదేశించారు.

# బ్రూనే సుల్తాన్‌కు 7000 లగ్జరీ కార్లు

అందులో 600 రోల్స్ రాయిస్ కార్లు ▪ దౌత్య సంబంధాల కోసం బ్రూనే వెళ్తున్న మోడీ

## ప్రధానికి స్వాగతం పలకనున్న బ్రూనే సుల్తాన్





ముందడుగు జాతీయం:
బ్రూనే సుల్తాన్ హస్సనాల్ బోల్కియా ప్రధాని నరేంద్ర మోడీకి స్వాగతం పలకనున్నారు. రెండు దేశాల మధ్య ఉన్న 40 ఏళ్ల దౌత్య సంబంధాలను బలోపేతం చేయనున్నారు. ప్రపంచంలోని సంపన్న వ్యక్తుల్లో బోల్కియా ఒకరు. ఆయన చాలా విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు. ఆయన వద్ద అత్యధిక సంఖ్యలో ఖరీదైన కార్లు ఉన్నాయి. సుమారు 5 బిలియన్ల డాలర్ల ఖరీదైన లగ్జరీ కార్లు ఉన్నట్లు తెలుస్తోంది. బ్రూనే ఇంధన, గ్యాస్ రిజర్వ్‌ల నుంచి ఆయన సుమారు 30 బిలియన్ల డాలర్లు సంపాదించారు. సుల్తాన్ బల్కియా వద్ద సుమారు ఏడు వేల లగ్జరీ వాహనాలు ఉన్నాయి. వాటిల్లో 600 రోల్స్ రాయిస్ కార్లు ఉన్నాయి. ఆయన పేరిట గిన్నిస్ వరల్డ్ రికార్డు ఉంది. బోల్కియా కలెక్షన్‌లో 450 ఫెరారీలు, 380 బెంట్లీ కార్లు కూడా ఉన్నాయి. పోర్షె, లాంబోర్గిని, మేబాచ్, జాగ్వార్, బీఎండబ్ల్యూ, మెక్‌లారెన్ కార్లు కూడా అతని వద్ద ఉన్నాయి.

### భవంతికి గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు

సుల్తాన్ బోల్కియా కలెక్షన్‌లో బెంట్లీ డామినేటర్ ఎస్‌యూవీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నది దాని విలువ సుమారు 80 మిలియన్ల డాలర్లు. పోర్షె 911 హారిజన్ బ్లూ, 24 క్యారెట్ల గోల్డ్ ప్లేట్ రోల్స్ రాయిస్ సిల్వర్ స్పర్-2 కార్లు ఉన్నాయి. కస్టమ్ డిజైన్డ్ రోల్స్ రాయిస్ విత్ ఓపెన్ రూఫ్ కారు కూడా ఉంది. కూతురు, యువరాణి మజేదేదా పెళ్లి కోసం 2007లో గోల్డ్ కోటింగ్ రోల్స్ రాయిస్ కారును ఆయన ఖరీదు చేశారు. ఇస్తానా నూరుల్ ఇమాన్ ప్యాలెస్‌లో సుల్తాన్ బోల్కియా నివాసం ఉంటున్నారు. అతిపెద్ద రెసిడెన్షియల్ ప్యాలెస్‌గా ఆ భవంతికి గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. సుమారు 20 లక్షల చదరపు అడుగులు ఆ ప్యాలెస్ ఉంటుంది. 22 క్యారెట్ల బంగారంతో ఆ భవంతిని దీర్చిదిద్దారు. బ్రూనే సుల్తాన్ ప్యాలెస్‌లో అయిదు స్విమ్మింగ్ పూల్స్, 1700 బెడ్ రూమ్స్, 257 బాత్ రూమ్‌లు, 110 గ్యారేజీలు ఉన్నాయి. ఆ సుల్తాన్‌కు ప్రైవేటు జూ కూడా ఉన్నది. దాంట్లో 30 బెంగాలీ టైగర్లు, రకరకాల పక్షి జాతులు, బోయింగ్ 747 విమానం ఉన్నది.

## వాహన రుణాల కోసం అవగాహన

# ఒప్పంద పత్రంపై సంతకాలు



ముందడుగు హైదరాబాద్:
ఆటో ఫైనాన్సింగ్ కోసం భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, జేఎల్ఆర్ ఇండియా కోసం అవగాహన ఒప్పంద పత్రంపై సంతకాలు చేసుకున్నాయి. బ్యాంక్ ఇప్పుడు జేఎల్ఆర్ ప్రాధాన్య వాహన ఫైనాన్షియర్ కానుంది. ఇది వినియోగదారులకు ప్రత్యేక ఫైనాన్సింగ్ పథకాలు, ప్రత్యేక ఆఫర్‌లు/ కార్యక్రమాలు మరియు ప్రాధాన్యతా సేవలు/ఎంగేజ్‌మెంట్ వంటి అనేక ప్రయోజనాలను అందుబాటులోకి తీసుకువస్తుంది.

రెండు బ్రాండ్‌ల మిశ్రమ బలాన్ని ఉపయోగించడం ద్వారా, వినియోగదారులకు అంతరాయం లేని ఫైనాన్సింగ్ ఎంపికలు, ఆధునిక లగ్జరీ కార్ల కొనుగోలు అనుభవాన్ని అందించడమే దీని లక్ష్యం. జేఎల్ఆర్ మోడల్స్ మొత్తం శ్రేణికి సంబంధించిన ఆఫరింగ్‌లను కలిగి ఉన్న ఒప్పంద పత్రంపై జేఎల్ఆర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్- రాజన్ అంబ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రిటెయిల్ అసెట్స్ గ్రూప్ హెడ్ అరవింద్ వోహ్రా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి ఇతర సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, అఖిలేష్ కుమార్ రాయ్ - బిజినెస్ హెడ్, ఆటో లోన్స్ & ఇన్వెంటరీ ఫైనాన్స్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తదితరులు ఉన్నారు. ఈ సేవలు అన్నీ జేఎల్ఆర్ ప్రత్యేక షోరూమ్‌లు, డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంటాయి.

# నిందితుడికి మరణశిక్ష విధించాలి..

## సీబీఐని డిమాండ్ చేసిన మమతా బెనర్జీ

### రేపిస్టులకు కఠినశిక్ష విధించాలని అసెంబ్లీ తీర్మానం

ముందడుగు పశ్చిమబెంగాల్:
పశ్చిమబెంగాల్ కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలి ఘటనలో నిందితుడికి మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నామని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో అపరాజిత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె ప్రసంగించారు. ఆగస్టు 9వ తేదీన లేడీ డాక్టర్ మృతిచెందిన తర్వాత.. ఆ రోజే ఆమె పేరెంట్స్‌తో మాట్లాడినట్లు చెప్పారు. వాళ్ల ఇంటికి వెళ్లడానికి ముందే.. ఆడియో, వీడియో, సీసీటీవీ ఫూటేజ్‌ను అందజేసినట్లు చెప్పారు. ఆదివారం వరకు సమయం ఇవ్వాలని ఆ డాక్టర్ పేరెంట్స్‌ను కోరామని, ఒకవేళ దోషిని పట్టుకోకుంటే అప్పుడు కేసును సీబీఐకి అప్పగిస్తామని చెప్పామన్నారు. కానీ పోలీసులు 12 గంటల లోపే నిందితుడిని పట్టుకున్నారని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసును పరిష్కరించాలని పోలీసులకు చెప్పినట్లు సీఎం వెల్లడించారు. కానీ కేసును సీబీఐకి అప్పగించారని, అందుకే సీబీఐ ఈ కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామని, నిందితుడికి మరణశిక్ష విధించాలని ముందు నుంచి డిమాండ్ చేస్తున్నట్లు మమతా బెనర్జీ తెలిపారు.



అమ్మాయి హక్కులను రక్షించేందుకు ప్రతి రోజు పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. మహిళ పట్ల జరుగుతున్న వివక్షను రూపుమాపేందుకు 1981లోనే ఐక్యరాజ్యసమితి కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆడ పిల్లల రక్షణ కోసం గళం వినిపిస్తున్న ప్రతి ఒక్కరికీ తాను కంగ్రాట్స్ చెబుతున్నట్లు సీఎం వెల్లడించారు. కోల్‌కతా ఆర్జీ కర్ కాలేజీ ఘటనలో ఇప్పటికే ప్రధాని మోడీ రెండు సార్లు లేఖలు రాసినట్లు చెప్పారు. ఆయన నుంచి తనకు రిప్లై రాలేదని, కానీ కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ నుంచి సమాధానం వచ్చినట్లు తెలిపారు. రేపిస్టులకు కఠిన శిక్ష విధించాలని కోరుతూ మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన అపరాజిత బిల్లు పాసైంది.

ముందడుగు
బుధవారం, 04-09-2024, హైదరాబాద్



# పదేండ్లుగా ఆయన్ని ప్రేమిస్తున్నా! :సాయిపల్లవి

దక్షిణాది సినీరంగంలో సాయిపల్లవి పంథాయే వేరు. గ్లామర్ పాత్రలకు పూర్తి దూరంగా ఉంటుందీ భామ. చూడగానే పక్కింటి అమ్మాయిలా కనిపించే ఈ తమిళ సొగసరి ఎలాంటి నాటకీయత లేని సహజమైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పిస్తుంటుంది. అందుకే ఈ భామకు దక్షిణాదిలో అభిమానగణం ఎక్కువ. 'ప్రేమమ్'తో మలయాళ సినీరంగంలో మొదలైన ఆమె ప్రయాణం ఇప్పుడు బాలీవుడ్ వరకూ వెళ్లింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ప్రేమ, పెళ్లి గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఇప్పటివరకు మీరు ప్రేమలో పడలేదా? అని అడగ్గా.. మహాభారత ఇతిహాసం తనకు చాలా ఇష్టమని, అందులో అభిమన్యుడి పాత్రను తాను ఎంతగానో ప్రేమిస్తానని చెప్పుకొచ్చింది. 'గత పదిహేడేండ్లుగా అభిమన్యుడి పాత్ర గురించి ఏదో కొత్త విషయం తెలుసుకుంటూనే ఉన్నా. ఆయనకు సంబంధించిన ఏ కథ అయినా నాలో ఆసక్తిని పెంచుతుంది.

ఓరకంగా చెప్పాలంటే గత పదేండ్లుగా ఆయన ప్రేమలో ఉన్నా అంటూ నవ్వుతూ తన మనసులోని మాటను బయటపెట్టింది. సాయిపల్లవి సమాధానం విన్న నెటిజన్లు ఆమెలో హాస్యచతురత కాస్త ఎక్కువేనని కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం సాయిపల్లవి తెలుగులో 'తండేల్', తమిళంలో 'అమరన్', హిందీలో 'రామాయణ' సినిమాలతో బిజీగా ఉంది.

## వినాయకుడిని వీటితో కూడా అందంగా చెయ్యొచ్చు..

### పర్యావరణ హితం కోసం మన వంతు బాధ్యత

### ఈ వస్తువులతో అందమైన విగ్రహం అవుతోంది..



ముందడుగు ప్రత్యేకం:
వినాయక చవితి వస్తుందంటే చాలు.. నానా హంగామా ఉంటుంది.. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు నవరాత్రులు సందడి, సందడిగా గడుపుతారు.. ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాన్ని ఇంటి వద్ద, బహిరంగ ప్రదేశాల్లో లేదా మండపాలలో ప్రతిష్టించి పూజిస్తారు. విగ్రహాన్ని 9 లేదా 10 రోజులు గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుతారు. భజన, కీర్తన సహా అనేక మతపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం 10 వ రోజు గణేశ విగ్రహాన్ని నదిలో లేదా చెరువులో నిమజ్జనం చేస్తారు. అయితే గతం కంటే ఇప్పుడు ప్రజల్లో పర్యావరణం గురించి అవగాహన పెరుగుతోంది. దీంతో ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌కు బదులుగా మట్టి లేదా పర్యావరణ అనుకూల విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారు. ఎందుకంటే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ నీటిని కలుషితం చేస్తుంది.

ఈ నేపథ్యంలో మట్టితో చేసిన పర్యావరణ అనుకూలమైన గణపతి విగ్రహం మీద ఎక్కువమంది ఆసక్తిని చూపిస్తున్నారు. అయితే ఇంట్లో కూడా పర్యావరణ అనుకూలమైన గణపతి విగ్రహాన్ని తయారు చేసుకోవచ్చు. మట్టి విగ్రహ తయారీ కోసం, పర్యావరణ అనుకూలమైన గణపతి విగ్రహాన్ని తయారు చేయడానికి ఒక కిట్ కూడా మార్కెట్ లో లభిస్తుంది. ఈ కిట్ ని ఉపయోగించి వినాయక విగ్రహాన్ని తయారు చేయవచ్చు.

#### ఆవు పేడ

ఆవు పేడతో చేసిన విగ్రహాలు పర్యావరణ అనుకూలమైనవి. అటువంటి పరిస్థితిలో మీరు కూడా వినాయక చవితి రోజున ఆవు పేడతో చేసిన వినాయక విగ్రహాన్ని కూడా ప్రతిష్టించవచ్చు.

#### పసుపు

వంటగదిలో లభించే పసుపుతో కూడా బొజ్జ గణపయ్య విగ్రహాన్ని తయారు చేయవచ్చు. ముందుగా పసుపును మెత్తగా పిండిగా చేసి ఆ తర్వాత ఆ పసుపుతో వినాయకుని విగ్రహాన్ని తయారు చేయండి

#### బియ్యం పిండి

ఇంట్లో లభించే బియ్యం పిండితో కూడా గణపతి విగ్రహాన్ని కూడా సిద్ధం చేసుకోవచ్చు. దీని కోసం పసుపు, బీట్‌రూట్‌లను జోడించి.. ఈ రెండింటిలో దేనినైనా రసంతో బియ్యంపిండి కలిపి.. ఆకులతో అలంకరించాలి.

#### సగ్గుబియ్యం

మట్టితో చేసిన లేదా ఇంటిలో పర్యావరణ అనుకూలమైన గణపతి విగ్రహాన్ని అలంకరించేందుకు సగ్గు బియ్యం, డ్రై ఫ్రూట్స్, బియ్యం, రంగురంగుల పప్పులు, ఆర్గానిక్ పెయింట్లను ఉపయోగించవచ్చు.

#### విగ్రహం తయారు చేసే విధానం

గణేశుని విగ్రహాన్ని తయారు చేయడానికి సాధారణ మట్టి, పసుపు లేదా పిండి వంటి ఏదైనా ఉపయోగించవచ్చు. అప్పుడు మట్టిని ముందుగా తడిపి మృదువుగా చేయండి. తర్వాత విగ్రహం తయారు చేయడం సులభం.

ముందడుగు
బుధవారం, 04-09-2024, హైదరాబాద్



## ట్రెండింగ్‌లో దేవర చుట్టమల్లె సాంగ్..

పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలుగు సినిమాల్లో ఒకటి దేవర. జూనియర్ ఎన్టీఆర్ టైటిల్‌లో రోల్ పోషిస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ దేవర రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ఇప్పటికే మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా చుట్టమల్లె (Chuttamalle) మెలోడీ ట్రాక్‌ను విడుదల చేశారని తెలిసిందే. తారక్, జాన్వీకపూర్ కెమిస్ట్రీలో వచ్చే ఈ డ్యుయెట్ సాంగ్ సినిమాకే హైలెట్‌గా ఉండబోతుందని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. ఈ సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఇంప్రెస్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది.

చుట్టమల్లె పాట విడుదలైన నెలలోపే (29 రోజులు) యూట్యూబ్‌లో 100 మిలియన్లకుపైగా వ్యూస్‌తో నంబర్ 1 స్థానంలో ట్రెండింగ్‌లో నిలుస్తుంది. ఈ సాంగ్ నాలుగు వారాలుగా మోస్ట్ ట్రెండింగ్ జాబితాలో కొనసాగుతుండటం విశేషం. తారక్, జాన్వీకపూర్ కాంబోను మూవీ లవర్స్ ఏ స్థాయిలో ఎంజాయ్ చేస్తున్నారో చెప్పేందుకు ఇది ఒక ఉదాహరణ. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను శిల్పా రావు పాడింది. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో నటిస్తుండగా.. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్, మలయాళ యాక్టర్ షైన్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ, హిమజ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్ , యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## విదేశీ భాషలు నేర్చుకుంటే

# మంచి భవిష్యత్తు

### కోర్సు పూర్తవ్వగానే మంచి జాబ్ ఆఫర్స్ ▪ ఊహించని విధంగా లక్షల్లో జీతం..



ముందడుగు ప్రత్యేకం:

ఉన్నత చదువులు చదివిన కూడా చదివిన చదువుకు మంచి ఉద్యోగం దొరకక ఎంతోమంది నిరుత్సాహ పడుతారు. ప్రభుత్వ ఉద్యోగాలలో పోటీ మాత్రం చెప్పలేకుండా ఉంటుంది. ఏ రంగంలో చూసుకున్న పోటీ ఎక్కువగానే ఉంది. మంచి నైపుణ్యం ఉన్నవారికే ప్రవేట్ కంపెనీలు కూడా పట్టం కడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆల్టర్నేటివ్ కెరీర్ ఆప్షన్స్‌పై దృష్టి పెట్టడం మంచిది. ఇలాంటి వాటిలో ఫారిన్ లాంగ్వేజెస్ నేర్చుకోవడం ఒకటి. కొన్ని విదేశీ భాషలు నేర్చుకొని కంటెంట్ రైటర్, ట్రాన్స్‌లేటర్‌గా కెరీర్ ప్రారంభించవచ్చు. ప్రభుత్వ విభాగాలు, మల్టీనేషనల్ కంపెనీలో కూడా జాబ్ ఆఫర్స్ ఉంటాయి. ఈ జాబ్ రోల్స్‌కు నెలకు రూ.40వేల నుంచి రూ.20లక్షల వరకు యాన్యువల్ ప్యాకేజీ అందుకోవచ్చు. ఇందుకు అందుబాటులో ఉన్న కోర్సులు, జాబ్ ఆఫర్స్ ఏవో చూద్దాం.

### డిగ్రీ, డిప్లొమా కోర్సులు

మనదేశంలో కొన్ని ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్ విదేశీ విద్యపై స్పెషల్ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఫారిన్ లాంగేజ్‌లపై డిగ్రీ, డిప్లొమా కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఈ కోర్సులు ఆయా భాషలపై నైపుణ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి నేర్చుకుంటే, భవిష్యత్తులో మంచి జీతంతో ఉద్యోగాలు పొందవచ్చు.

### కెరీర్

ఫారిన్ లాంగ్వేజెస్‌పై పట్టు సాధిస్తే, చాలా జాబ్ ఆప్షన్ ఉంటాయి. ట్రాన్స్‌లేటర్, ఇంటర్‌ప్రెటర్, కంటెంట్ రైటర్, లాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్, కస్టమర్ సర్వీస్ ఎక్స్‌పర్ట్ వంటి రోల్స్ ఉన్నాయి. ట్రాన్స్‌లేటర్ కంటెంట్‌ను ట్రాన్స్‌లేట్ చేయాలి. ఉన్నత స్థాయి సమావేశాల్లో ఇంటర్‌ప్రెటర్ సేవలు అందించాలి. డిజిటల్ మార్కెటింగ్, మీడియా మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్ వంటి రంగాల్లో సైతం మంచి ఆఫర్స్ ఉంటాయి.

### ఎంపిక చేసుకోవాల్సిన భాషలు

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రకాల భాషలు ఉన్నాయి. అయితే వాటిలో కొన్నింటికి మాత్రమే ఉద్యోగాల్లో మంచి డిమాండ్ ఉంది. ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, జపనీస్, చైనీస్, రష్యన్ వంటి భాషలు నేర్చుకుంటే అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగవకాశాలను సొంతం చేసుకోవచ్చు. కంపెనీలతో పాటు ఎడ్యుకేషన్, మీడియా, టెక్నాలజీ వంటి రంగాల్లో ఈ ఫారిన్ లాంగ్వేజ్‌లకు డిమాండ్ పెరుగుతోంది.

### జీతభత్యాలు

విదేశీ భాషల్లో ప్రావీణ్యం ఉన్నవారికి జీతాలు వారు పనిచేసే రంగం, పనితీరు ఆధారంగా ఉంటాయి. కెరీర్ ప్రారంభంలో ట్రాన్స్‌లేటర్, ఇంటర్ ప్రెటర్లకు జీతం నెలకు రూ.25,000 నుంచి రూ.40,000 మధ్య ఉంటుంది. అనుభవం, నైపుణ్యం ఉంటే జీతం రూ.1లక్ష లేదా అంతకంటే ఎక్కువగా ఉండవచ్చు. మల్టీనేషనల్ కంపెనీలు, ప్రభుత్వ విభాగాలు, అంతర్జాతీయ సంస్థల్లో పనిచేస్తున్న వారు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు యాన్యువల్ ప్యాకేజీ పొందుతున్నారు.

### ఉపాధి దొరికే రంగాలు

విదేశీ భాషల్లో ఎక్స్‌పర్ట్‌గా గుర్తింపు పొందింతే ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధి దొరుకుతుంది. మల్టినేషనల్ కంపెనీల్లో ఉద్యోగం చేయడమే కాకుండా ట్రావెలింగ్, టూరిజం, మీడియా, ఎడ్యుకేషన్, ట్రాన్స్‌లేషన్ సర్వీస్, అంతర్జాతీయ వాణిజ్యం ఇలా.. అనేక రంగాల్లో ఉద్యోగవకాశాలు పుష్కలంగా ఉంటాయి. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పర్యాటక శాఖ వంటి ప్రభుత్వ విభాగాల్లో సైతం జాబ్ ఆఫర్స్ ఉంటాయి. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు సైతం విదేశీ భాషల్లో నిపుణులను నియమించుకుంటున్నాయి.